క్లుప్తంగా

సచివాలయ కన్వీనర్ నియామకం



కన్వీనర్ భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు 471 సచివాలయ కన్వీనర్‌గా కడితి భాగ్యలక్ష్మిని ఇటీవల వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నియమించారు. ఈ సందర్భంగా శుక్రవారం జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును గోపాలపట్నంలోని ఆయన ఇంటి వద్ద భాగ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలని భాస్కరరావు సూచించారు. ప్రజలకు, సచివాలయ కార్యదర్శులకు వలంటీర్లకు వారధిలా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, దేరెడ్ల సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



మృతుడు సురేష్ నుంచి కళ్లు సేకరిస్తున్న వైద్యులు

మల్కాపురం: ఆ యువకుడు మరణించినా ఓ అంధుడికి కంటి వెలుగు ఇచ్చి పలువురికి ఆదర్శంగా నిలిచాడు. 61వ వార్డు మల్కాపురం పల్లివీధికి చెందిన గొలగాని సురేష్‌యాదవ్(30) అనారోగ్యం కారణంగా శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తాను మృతి చెంది నా కళ్లు దానం చేయాలని కోరాడు. అతడి కోరిక మేరకు తల్లిదండ్రులు గొలగాని అప్పలనాయుడు, అప్పలనర్సమ్మ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఆస్పత్రికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి కళ్లు సేకరించారు.

గరికపాటి రాజారావు ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న నాయకులు

విశాఖ విద్య: ప్రజా నాట్యమండలి వ్యవస్థాపకుడు డాక్టర్ గరికపాటి రాజారావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీఎస్ఎం విశాఖ జిల్లా వ్యవస్థాపకులు అరుణ్ అన్నారు. ఎస్‌పీడీ కూడలిలోని హమ్మీ భవన్‌లో శుక్రవారం డాక్టర్ గరికపాటి రాజారావు 60 వర్ధంతి నిర్వహించారు. గరికపాటి చిత్రపటానికి అరుణ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం. చంటి, తెలుగు రమణ, ఎం. నాగేశ్వరరావు, రాగిణి, యూటీఎఫ్ జిల్లా నాయకులు అప్పారావు, రాష్ట్ర నాయకులు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం ఇందిరానగర్‌లో శ్రీకృష్ణయాదవ్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాన్ని శుక్రవారం ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు(గణబాబు) సందర్శించారు. కృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండపం వద్ద నిర్వహించిన అన్నసమారాధనలో భక్తులకు ఆయన అన్నప్రసాదం వడ్డించారు.



బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ

ఆరోగ్య రక్ష..!

- బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ ద్వారా కార్పొరేట్ వైద్యం
- ఉచితంగానే ఖరీదైన వైద్య పరీక్షలు

విశాఖ విద్య: చిన్నపాటి జ్వరమొచ్చినా వైద్యం కోసమని పరుగులు పెట్టాల్సి వచ్చేది. నేడు చెంతనే అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా నగర వాసులకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆస్పత్రులను బలోపేతం చేసింది. దీంతో నగర వాసుల ఆరోగ్య పరిరక్షణకు యూపీహెచ్‌సీలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 90 వార్డు బుచ్చిరాజుపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం 25 వేల మందికి పైగా ప్రజానీకానికి వైద్య సేవలు అందిస్తోంది. ప్రతీ రోజూ 70 మందికి పైగా ఇక్కడికి వైద్యం కోసం వస్తుంటారు. సకాలంలో వైద్యం అందించటంతో



పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్న పీడియాట్రిక్ వైద్య నిపుణురాలు

పాటు, మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు.

అందుబాటులో స్పెషలిస్టు వైద్యులు

బుచ్చిరాజు పాలెం వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రతీ రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తుంది. ఇక్కడ ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, లాస్ట్‌గ్రేడ్ సర్వీసు(అటెండర్) విధులు నిర్వహిస్తున్నారు. రోగులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం అందించే క్రమంలో స్పెషలిస్టు వైద్యులు సైతం ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు.

స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు..	
సోమవారం :	చెవు, ముక్కు వ్యాధికి సంబంధించిన వైద్యుడు
మంగళవారం :	ఆర్థోపెడిక్ వైద్యుడు
గురువారం :	మహిళా సంబంధిత వైద్య నిపుణురాలు
శుక్రవారం :	పిల్లల వైద్య నిపుణురాలు



యూపీహెచ్‌సీలో అందుబాటులో అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్ష పరికరాలు

స్త్రీ వ్యాధి నిపుణులు, అర్థోపెడిక్, ఈఎన్‌టీ, చిన్నపిల్లల వైద్య నిపుణులు వారంలో ఒక్కో రోజు ఇక్కడ అందుబాటులో ఉంటూ వైద్యం అందిస్తున్నారు.

ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. 63 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. యూపీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు అందిస్తుండమే కాకుండా దీని పరిధిలోని 8 సచివాలయాల్లో కూడా రోగులకు వైద్యం అందించేలా ఏర్పాట్లు చేశారు. సచివాలయాల్లో ఏఎన్ఎంలు వైద్య సేవలు అందిస్తున్నారు. అవసర మైన వారిని బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీకి పంపిస్తున్నారు.

వినాయక చవితి వేడుకలు ఆనందంగా జరుపుకోవాలి

విశాఖ విద్య: వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితంగా.. ఆనందంగా జరుపుకోవాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆకాంక్షించారు. 52వ వార్డు కరాస రామాలయం వద్ద గ్రామ కమిటీ, శ్రీ బంగారమ్మ, శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ, కరాస రాక్ స్టార్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జియ్యాని శ్రీధర్, వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్‌కుమార్‌లను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకునేందుకు కమిటీ సభ్యులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగిరెడ్డి, వినోద్, బంగారిరెడ్డి, దివాకర్, బాబీ, వెంకటేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



పందిరి రాట వేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

62వ వార్డులో మెగా ఫాగింగ్

సింథియా: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు శుక్రవారం 62వ వార్డులో దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్ నిర్వహించారు. ఏడీసీ డాక్టర్ సన్యాసిరావు పర్యవేక్షణలో బయాలజిస్ట్ దాడి సాంబమూర్తి, జోన్–5 మల్కాపురం ఏరియా మలేరియా నివారణ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఫాగింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర సీజనల్ వ్యాధుల కట్టడికి జీవీఎంసీ తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి లోపల, బయట పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా నివారణ ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, వార్డు అధ్యక్షులు భీశెట్టి గణేష్, నక్కా సూర్యనారాయణ, కామేశ్వరరావు, జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీ త్రివిక్రమ్ వర్మకు ఉత్కృష్ట సేవా పతకం

దొండపర్తి: నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ ప్రతిష్ఠాత్మక ఉత్కృష్ట సేవా పతకం లభించింది. ఆయనతో పాటు జిల్లాలో ముగ్గురు సీఐలను, ఒక ఏఎస్ఐతో పాటు 14 మంది హెచ్‌సీలు, 14 మంది కానిస్టేబుళ్లను ఈ పతకానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. అలాగే అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఒక ఎస్ఐతో పాటు 16 మంది హెచ్‌సీలు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

ఎంపికైన వారు..

దువ్వాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఎ.వెంకటలీలా రావు, ద్వారకా సబ్‌డివిజన్ క్రైం టి.ఇమాన్యుయల్ రాజు, కంచరపాలెం ఏఎస్ఐ కె.కనకరాజు ఉత్కృష్ట సేవా పతకాన్ని అందుకోనున్నారు. అలాగే హెడ్‌కానిస్టేబుళ్లు ఎం.జీవన్‌కుమార్(సీఏఆర్), జి.వి.రమణ(గోపాలపట్నం ట్రాఫిక్), ఎం.బాలరాజు(పీఎం పాలెం క్రైం), టి.వసంతరావు(సీఎస్‌బీ), జె.ఎం.ఎం.రెడ్డి(పద్మనాభం), జి.శ్రీనివాసరావు(త్రీటౌన్), ఎస్.శ్రీనివాసరావు(దువ్వాడ), డి.సురేష్‌కుమార్(దువ్వాడ క్రైం), ఎ.రమేష్‌కుమార్(దువ్వాడ ట్రాఫిక్), పి.జయసీలన్ (ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్), జి.శ్రీహరి(మల్కాపురం), కె.ప్రసాద్(మల్కాపురం), టి.కామేశ్వరరావు(ఆనందపురం క్రైం)తో పాటు ఏసీబీ హెచ్‌సీ టి.కొండలరావు ఈ సేవా పతకానికి ఎంపికయ్యారు. అదే విధంగా కానిస్టేబుళ్లు జి.ప్రసాద్(ఏఆర్), కె.ఎస్.స్వామి(ఏఆర్), జి.శ్రీనివాసరావు(ఏఆర్), వి.దశరావు(ఏఆర్), ఎం.గోవిందరావు(ఏఆర్), పి.సన్యాసిరావు(ఏఆర్), ఎస్.బి. వెంకటేశ్వర్లు(వన్‌టౌన్ క్రైం), ఇ.మునిరాజు(ఏఆర్), ఎస్.ఎరిబాబు (ఏఆర్), బి.శ్రీధర్(ఏఆర్), ఎం.వీరబాబు(ఏఆర్), కె.చిన్నయ్య(ఏఆర్), ఎం.ప్రసాదరావు(ఏఆర్), పి.చిన్న బొజ్జయ్య ఎంపికయ్యారు.

అతి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికైన వారు..

న్యూపోర్ట్ ట్రాఫిక్ ఎస్ఐ పి.రాజు, హెచ్‌సీలు కె.వైకుంటరావు (ఏఆర్), ఆర్.మాధవరావు(ఏఆర్), టి.రాము (ఆనందపురం ట్రాఫిక్), జె.వెంకటరవి(ఏఆర్), పి.వరహాలు(దువ్వాడ), ఎ.రమణారావు(సీసీఎస్), జి.శ్రీనివాసరావు(టూ టౌన్ ట్రాఫిక్), కె.బాబా అమర్ శేఖర్ (సీఎస్‌బీ), కె.ఈశ్వరరావు(గాజువాక క్రైం), వి.కనకరావు(ఏఆర్), ఎస్.కె.సుభాన్(సీఎస్‌బీ), జి.రామారావు(ఏఆర్), బి.ఎస్.మూర్తి(ఎంవీపీ)తో పాటు 16వ బెటాలియన్ హెచ్‌సీలు బి.రామానుజులు, పి.కోటేశ్వరరావు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌లో హెచ్‌సీ ఎం.సన్యాసిరావు ఈ పతకానికి ఎంపికయ్యారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ మకుడి–సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్ల మధ్య జరుగుతున్న మూడో లైన్ సంబంధిత ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి తెలిపారు. ప్రయాణికుల మార్పులను గమనించి సహకరించాలని రైల్వే అధికారుల తెలిపారు. ఈ నెల 20 నుంచి 25 వరకు విశాఖలో బయల్దేరే విశాఖ–న్యూఢిల్లీ(20805) ఏపీ ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా విజయనగరం, టిట్లాఘర్, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 20నుంచి 25వ తేదీ వరకు న్యూఢిల్లీలో బయల్దేరే న్యూఢిల్లీ– విశాఖ (20806)ఏపీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, గొండియా, రాయ్‌పూర్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 14, 21వ తేదీల్లో బయల్దేరే విశాఖ–గాంధీదాం (20803) వీక్లీ ఎక్స్‌ప్రెస్ విజయనగరం, రాయపూర్, గొండియా, నాగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తుంది. ఈ నెల 24న గాంధీదాంలో బయల్దేరే గాంధీదాం–విశాఖ (20804) వీక్లీ ఎక్స్‌ప్రెస్ వయా నాగ్‌పూర్, రాయ్‌పూర్, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గోపాలపట్నం: ఎయిర్‌పోర్టు జంక్షన్ సమీపంలో లారీ ఢీకొట్టిన ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘనట శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్ఏడీ నుంచి గాజువాక వెళ్తున్న జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని అదే దారిలో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అదుపు తప్పి పడి పోయిన యువకుడి తలపై నుంచి లారీ వెళ్లడంతో తల భాగం ఛిద్రమైంది. మృతుని వివరాలు తెలియరాలేదు. లారీ అక్కడే వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు.

నేడు కళావేదిక ప్రారంభోత్సవం

విశాఖ విద్య: జీవీఎంసీ 52 వార్డు తారకరామ అపార్ట్‌మెంట్స్ కాలనీలోని పార్కులో నూతనంగా నిర్మించిన కళావేదికను శనివారం ప్రారంభిస్తున్నట్లు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. తారకరామ అపార్ట్‌మెంట్ పరిసర కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు.

ప్రసాద్ పథకంతో సింహగిరికి మహర్దశ

రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన రూ.55కోట్ల ప్రసాద్ పథకం నిధులతో సింహగిరికి మహర్దశ పడుతుందని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. ప్రసాద్ పథకం పనులకు సంబంధించి రూపొందించిన డీపీఆర్‌ను ఆయన శుక్రవారం సింహాచలం దేవస్థానంతో అధికారులతో కలిసి పరిశీలించారు. దేవదాయశాఖ, దేవస్థానం, టూరిజంశాఖ అధికారులతో పనులు జరిగే ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు పూర్తి స్థాయిలో వినియోగపడేలా అభివృద్ధి పనులు జరగాలని, అంతేకాని ఏ పనీ వృథాగా పోకూడదని సూచించారు. ఆలయ ఉత్తర ప్రాంగణంలో ఉన్న ప్రదేశంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించే విషయంపై వైదికుల సూచనలను పరిగణలోకి తీసుకున్నామన్నారు. అలాగే ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా ఉన్న సువిశాల ప్రదేశంలో క్యూకాంప్లెక్స్ నిర్మాణంపై చేయాలా...వద్దా అన్న విషయంపై పరిశీలన జరిపారు. మాస్టర్‌ప్లాన్‌కు ఎలాంటి విఘాతం కలగకుండా పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. కొండదిగువ పురాతన పుష్కరిణి సత్రాన్ని తొలగించి ఆ స్థానంలో జీప్లస్–ఫైవ్ కింద ఆధునిక సదుపాయాలతో సత్రాలను నిర్మిస్తామన్నారు. పుష్కరిణి సత్రం మధ్యలో ప్రస్తుతం ఉన్న పురాతన మండపాన్ని అలేగే ఉంచుతామని తెలిపారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు.అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఆధునికీకరిస్తామన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులతో కొంతసేపు మాట్లాడారు. దేవస్థానం ఈవో కార్యాలయ భవనం కూడా పక్కాగా నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. పాత అడవివరం వైపు నుంచి వచ్చే మార్గంలో ఉన్న రెండో టోల్‌గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన స్థలాన్ని పర్యాటకశాఖకు కేటాయిస్తామన్నారు. అలాగే సింహగిరిపై ఉన్న మ్యూజియాన్ని కమిషనర్ సందర్శించారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని, జ్ఞాపికను ఈవో త్రినాథరావు ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో టూరిజం శాఖ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ రమేష్, జేఈలు మదన్‌మోహన్, సీతారామ్, దేవదాయశాఖ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఏడీసీ రామచంద్రమోహన్, డీసీ సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, దేవస్థానం అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.



ప్రసాద్ స్కీమ్ పనుల ప్రణాళికను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



శ్రీకృష్ణుడు,గోపికల వేషధారణలో చిన్నారులు

కృష్ణా.. మురారీ

మల్కాపురం: శ్రీకృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన మండపాలు,శ్రీకృష్ణాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. మల్కాపురం గొల్లవీధి శ్రీకృష్ణాలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు,హెచ్‌పీసీఎల్ డీజీఎం తిరు, డీజీఎం (హెచ్.ఆర్) ప్రభాకర్, సీనియర్ మేనేజర్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. విజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు వార్డుల కార్పొరేటర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన భారీ అన్న సమారాధనను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ప్రారంభించారు. సాయంత్రం పల్లకీ స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని నెలకొల్పి పుర వీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు.

- బ్రహ్మకుమారి(శ్రీహరిపురం) సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను జరిపారు.ఈ సందర్భంగా చిన్నారులచే గోపాలుడు,గోపికల వేషదారణలు వేయించి ఉట్టి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు.



పూజల్లో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ అధికారులు



అన్నసమారాధన ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ



ఏయూ సోషల్ వర్క్ విభాగాధిపతి డాక్టర్ హరినాథ్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

అక్షరాస్యతతో ప్రగతి

మల్కాపురం: దేశాభివృద్ధితో పాటు ప్రజల సాధికారతకు అక్షరాస్యత ఎంతో అవసరం అని ఆంధ్ర విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగాధిపతి, జాతీయ సేవ పథకం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో అక్షరాస్యత, మూడ నమ్మకాలపై శుక్రవారం సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హరినాథ్ మాట్లాడుతూ అక్షరాస్యత వల్ల సమాజంలో అసమానతలు తొలగుతాయన్నారు. పేదరిక నిర్మూలనకు, ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణానికి, సంపద సృష్టికి అక్షరాస్యత ఎంతో అవసరం అని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు డాక్టర్ హరినాథ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి,అంజలిదేవి, అనసూయదేవి, సంధ్యారాణి, నదియా పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు పార్కింగ్‌తో అవస్థలు

మల్కాపురం: సర్వీసు రోడ్ల వెంబడి ఇష్టాను సారంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అత్యవసర వాహనాలు కూడా వెళ్లడానికి కూడా చోటు లేకుండా రోడ్డుకిరువైపులా ఆటోలు, ఇతర వాహనాలు నిలుపుతున్నారు. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ ఆలయం వెనుక మార్గంలో శుక్రవారం తెల్లవారుజామున ఓ వ్యక్తికి ఆరోగ్యం బాగులేకపోతే 108కు సమాచారం ఇచ్చారు. ఆ వాహనం వచ్చే సరికి మార్గానికి ఇరువైపులా ఆటోలు, ద్విచక్ర వాహనాలు,ఇతర వాహనాలు నిర్లక్ష్యంగా నిలిపి ఉంచడంతో 108 వాహనం రాలేక మధ్యలో నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరికి రోగిని ఆ కుటుంబ సభ్యులు చేతుల మీద మోసుకుంటూ అంబులెన్స్ వద్దకు తీసుకువెళ్లాల్సిన దుస్థితి వచ్చింది. నిర్లక్ష్యంగా వాహనాలు నిలుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



చోటు లేక నిలిచిపోయిన 108 వాహనం

ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు జ్ఞాపికలు

గోపాలపట్నం: గోపాలపట్నంలోని పలువురు ఉత్తమ ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుక్రవారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు తన ఇంటి వద్ద జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గురుపూజోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ నిర్వహించిన కార్యక్రమానికి అనివార్య కారణాల వల్ల తాను హాజరు కాకపోవడంతో వారికి జ్ఞాపికలు అందజేసినట్లు తెలిపారు. ఆడారి ఆనంద్‌కుమార్ తన సొంత నిధులతో వీటిని అందించారని చెప్పారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మరింత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ 91,92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, కంపర సత్తిబాబు, కోటేశ్వరరావు, రామకృష్ణ, డి.సత్యనారాయణ రెడ్డి, కబిత్ రాజు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు, విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న బెహరా భాస్కరరావు

జైదుర్గాదేవికి సామూహిక కుంకుమ పూజలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు జనతా కాలనీలోని శ్రీ జైదుర్గాదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా 300 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ భార్య ఆడారి మాలతి ముఖ్య అతిథిగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ కమిటీ సభ్యుడు ఆడారి అప్పారావు, పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అనంతరం నిర్వహించిన కుంకుమ పూజల్లో పాల్గొని, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొణతాల సుధ, వార్డు అధ్యక్షుడు వాసు, ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, నరేష్, ఇసుకరెడ్డి, హరీష్, సూకరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఆడారి మాలతి

ఫుట్‌పాత్ వ్యాపారులకు జరిమానా

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం బంక్ వద్ద ఉన్న పలు ఫుట్‌పాత్, తోపుడు బళ్ల వ్యాపారులకు జోన్–8 కమిషనర్ మల్లయ్య నాయుడు జరిమానా విధించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు వాడుతుండటం, దుకాణాల వద్ద పారిశుధ్య నిర్వహణ లేకపోవడం, రెండు డస్ట్ బిన్లు వాడాలన్న నిబంధనలు పాటించక పోవడంతో పలు దుకాణాదారులకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకు అపరాధ రుసుం వసూలు చేశారు. ప్రతీ దుకాణదారుడు తడి, పొడి చెత్త డబ్బాలు వాడాలని, వాటిని పారిశుధ్య కార్మికులు అందజేయాలని సూచించారు. దుకాణాల పరిసర ప్రాంతాల్లో చెత్త పడి ఉంటే కఠినంగా వ్యవహరిస్తామని జెడ్సీ హెచ్చరించారు.

చందన సమర్పణకు రూ.లక్ష విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం నగరానికి చెందిన నాగ జోత్స్న అనే దాత రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ సూపరింటెండెంట్ త్రిమూర్తులకు అందజేశారు. దాతకు దేవస్థానం తరఫున స్వామివారి దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు.